# తాబేళ్లు



ఘండికోట బ్రహ్మాజీరావు

చీఫ్ యింజనీరుగారు ఫీల్డు మైకులో మాట్లాడుతున్నారు.

"మరొక్క పదినిమిషాలలో పని ప్రారంభించాలి. పోలీసువారి పరిశోధన ముగిసింది. ముందుపడిన యింజనులు ఒకరు, పట్టాలు తప్పిన పెట్టెను మరొకరు, ఇద్దరు యింజనీర్లు ఎత్తించి, రైలు దారి బాగుచేయాలి. రేపు మధ్యాహ్నం పండ్రెండు గంటలవేళకు రైళ్ళు మామూలుగా నడవాలి."

చీఫ్ యింజనీరుగారంటే క్రింది వాళ్ళకు సింహస్వప్నం. అన్న నిమిషానికి పని పూర్తికాకపోతే చాలా యిబ్బందులు పడవలసి వస్తుంది.

రెండు ఇంజనులూ పట్టాలు తప్పాయి. ముందుది పట్టాలు తప్పి రాళ్ళలో నిలుచుంది. రెండవది వెల్లకిల పడి చక్రాలు ఆకాశానికి చూపించుతున్నది.

ఇంజనుల వెనుక నున్న నాలుగు పెట్టెలు పట్టాలు తప్పినవి. డ్రైవర్లకు చిన్నగాయాలు తగిలాయి. కొంతమంది ప్రయాణికులకు కూడా చిన్నచిన్న దెబ్బలు తగిలాయి ప్రథమచికిత్స కోసం కూడా చూడకుండా కొంతమంది పారిపోయారు. రైలు మరొక్క పది నిమిషాలలో నగరం చేరుకోవలసింది. ఇంతలోనే ఈ ప్రమాదం సంభవించింది.

రాత్రి తొమ్మిది గంటలవేళ ప్రమాదం జరిగింది. మరొక్క గంటలోనే స్టేషనునుండి, నగరం నుండి పోలీసులు, డాక్టర్లు, రైల్వేవారు అందరూ వచ్చారు. అప్పటినుంచీ జనంలో వార్త అల్లుకుపోయింది. ప్రజలు మాఘమాసపు చలిని కూడా లక్ష్యపెట్టకుండా వచ్చిపడ్డారు.

వెంటనే ఏమిచేయడానికీ వీలయింది కాదు. ప్రయాణీకులలో చాలామంది ప్రాణాలు దక్కినందుకు పిట్టలలా ఎగిరిపోయారు. మిగిలినవారిని స్టేషనుకు పంపించారు,

రాత్రికి రాత్రే అక్కడ పనివాళ్ళు గుడారాలు వేశారు. లైట్లు పెట్టారు. ఫీల్డు మైకు, లౌడుస్పీకర్లు అమర్చారు. ప్రతి పదినిమిషాలకు హెచ్చరిస్తున్నారు. పైనుంచి పెద్దవాళ్లు తెల్లవారేసరికి చేరుకున్నారు. అంతవరకు ఏ పనిచేయలేదు. తరువాత కూడా చేయడానికి పోలీసుల ఆజ్ఞకీ పూర్తికాలేదు. రాత్రి గడిచిపోయింది.

మధ్యాహ్నం దక్షిణంనుంచి ఒక జట్టు వచ్చింది. చిన్న యింజనీరు రావు, ఇద్దరు ఫోర్మెనులు, పనివాళ్ళు వచ్చారు బళ్ళనెత్తడానికి. ఉత్తరం నుండి ఒకజట్టు ఇంజనులని ఎత్తడానికి వచ్చింది.

కాని, పని మొదలుపెట్టడానికి వీలు కాలేదు. పోలీసులు ప్రదేశాన్ని చుట్టుముట్టారు. తెల్లవారిన దగ్గరనుండి ప్రజలు రావడం హెచ్చయింది. అదొక యాత్రాస్థలంగా మారిపోయింది. పిన్నలు పెద్దలు, స్త్రీలు...అందరూ వస్తున్నారు. వాళ్ల కోసం టీ దుకాణాలు, పకోడీ దుకాణాలు, వేరుశనగ తట్టలు రావడం మొదలయాయి.

ప్రమాదం జరిగినచోటు ఒక కటింగ్‌లో ఉంది. ఎత్తయిన దిబ్బ కోసి లైనులు వేశారు. పట్టాలు తప్పిన నాలుగు పెట్టెలలో మొదటిది ఎడమవేపు దిబ్బపైకెక్కి వెనుక చక్రాల మీద నిలుచుంది. రెండవది కుడిచేతివేపు దూసుకుపోయి దిబ్బను దున్నిపారేసింది. మూడవది పార్సెలు పెట్టె-అది మధ్యకు రెండు ముక్కలుగా విరిగింది. పైనున్న రేకు పట్టుతో కలిపి ఉంది. నాలుగవది పట్టాలు తప్పి నిలుచుంది. ఆ వెనుక పెట్టెలు

పోలీసులు, రైల్వేవారు ఉండడానికి తాత్కాలికమైన ఆశ్రయ మిచ్చాయి.

దక్షిణంనుంచి వచ్చిన రావు రాగానే అంతటా తిరిగి వచ్చాడు రైలు పట్టాలు ఎవరో వేరుచేశారు. ఎగువకు పోయే లైను, దిగువకు పోయే లైను కూడా ఈ ప్రమాదంవల్ల రాక పోకలకు వీలుకాకుండా పోయాయి. ఆ రెండు లైన్లమధ్య రావుకోవింతదృశ్యం కనుపించింది. అక్కడో ఎముకల కుప్ప ఉంది. చిరిగిన ఆడవాళ్ల రవికలు ఉన్నవి. పనికిరాని చింకిజోళ్ళు, తల వెంట్రుకల చుట్టలు, మానవుల పుర్రెలు ఉన్నవి. వాటిపక్కనే రైలుపట్టాలు వేరయి, ప్రమాదం సంభవించింది. ఈ అమంగళకరమైన వస్తువులకు, జరిగిన రైలుప్రమాదానికి ఏమి సంబంధం... ఏదోఉంది కాబోలు...ఎవరు వేరయారో ...ఎవరు తిరిగి రాలేదో...

రావు, ఫోర్మెనులు తిరుగుతున్నారు. పోలీసులు అనుమతి యిచ్చేవరకు తిరుగు తున్నారు. ఏ పెట్టెలను ముందు ఎత్తాలో, ఏ పెట్టెలను కోసి వేరుచేయాలో, ఎంత మంది పనివారిని ఎక్కడ నియోగించ డమో ఆలోచిస్తున్నారు.

సాయంకాలం వేళకి పోలీసుకుక్కలు వచ్చాయి. అవి అంతటా తిరిగి ఎవ రినీ గుర్తుపట్టలేక పోయాయి. అప్పటితో పోలీసులుఅనుమతించారు రైలుపెట్టెలను ఎత్తటానికి. అప్పుడే చీఫ్ యింజ నీరుగారు మైకులో ఆర్డరిచ్చారు చిన్న యింజనీర్లకి.

పట్టాల మీదనున్న పెట్టెలను వెను కకు తీసుకొనిపోయారు. తరువాత పడి పోయిన నాలుగవ పెట్టెను పట్టాలమీద నిలబెట్టి వెనుకకు లాగేశారు. చెడిపోయిన రైలులైను బాగుచేసుకుంటూ ముందుకు వచ్చేసరికి రాత్రి పన్నెండు గంటలవేళ అయింది.

అపుడు విరిగిన మూడో పెట్టెదగ్గరికి వచ్చాడు రావు. అంతవరకు వచ్చిపోతు న్నాడుగాని దీక్షగా అక్కడ నిలబడి ఉండలేదు. పెట్రోమాక్సులైట్ల వెలుతు రులో ఆ విరిగిన పార్సెలు పెట్టెను చూస్తున్నాడు.

చీఫ్ యింజనీరుగారు ఇంతలోఅక్క డకి వచ్చారు. దానిని గాస్‌తో కోయాలి. గాస్‌సిలిండర్‌లు అక్కడకు తెచ్చి పైపులు తగిలిస్తున్నారు.

"రావ్! ఈ పెట్టెను తీసివేయడానికి ఎంతకాలం పడుతుంది?" అడిగారు ఛటర్జీగారు.

"అవును సార్! ... అవును!..." అన్నాడు పరధ్యానంగా రావు.

"అవునేమిటి ? కోపంగా ప్రశ్నిం చాడు చీఫ్.

"చూడండి సార్ !... ఇంతవరకూ అవి చచ్చిపోయిన వనుకున్నాను కావి కాళ్ళు ఆడిస్తున్నవి......"

చీఫ్ చూచారు.

"పొద్దున్నే చెప్పాను, వీటిని తీసుకొని పొమ్మని...కాని ఎవరూ రాలేదా?"

"రాలేదు సార్ !"

ఛీఫ్ వెళ్ళిపోయారు. తిరిగి మైకులో మాట్లాడారు...పార్సెలు పెట్టెలో నున్న తాబేళ్లను తీసుకొనిపొమ్మని.

కాని ఎవరూ రాలేదు. మనుషులందరూ చెల్లాచెదరిపోయారు. వాటిని తీసుకొని పోవలసిన సిబ్బంది, పని చేస్తున్న వాళ్ళకు రొట్టెలు, టీ తేవడానికి ట్రక్కులో బజారుకి వెళ్ళిపోయారు.

రావు చూస్తూ నిలబడ్డాడు...మధ్యాహ్నం సంగతులు అతని మనస్సులో కదులుతున్నాయి.

గుట్టమీద నుంచి విసురుగా ఒక పడుచు, ఒక కాలేజీ విద్యార్థి క్రిందికి దిగి ఒక్కసారిగా ఆగిపోయారు.

"చూడు! ఎంత పెద్దవో ఈ తాబేళ్లు? కాని వాటి మెడలు ఎంత చిన్నవో... మనుషుంను చూచి వాటిని లోపలికి ముడుచుకుంటాయి, భయంతో...

వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక చిన్న కుర్రాడూ, వాడితండ్రి కాటోలు దిగివచ్చారు.

"నాన్నా !...ఈ తాబేళ్లను ఇలా వీపుమీద పడేశారేం ?"

"పారిపోతాయని..."

"అవి నడవనే లేవుకదా ?...ఎలా పారిపోతాయి."


"అలాగే మెల్లిగా పారిపోతాయి... నీరు దొరికిందంటే మరి పట్టుకోలేం."

వాళ్ళుకూడా వెళ్ళిపోయారు. తరవాత ఎవరో పెద్ద మనుష్యులు. పంచెలు, వాచీలు. చేతికర్రల వాళ్ళొచ్చారు .. వ్యాపార సరళిలో మాట్లాడుతున్నారు...

"పూరీలో ఈ తాబేలు ధర అయిదు రూపాయలు మాత్రమే.....కలకత్తాలో ఎంతో తెలుసా. రమారమి నూరు రూపాయలు. మామూలువాళ్ళు తినేదనా మీ అభిప్రాయం ! పూరీ తాబేళ్ళకు గ్రాండ్ హోటలులో మంచి గిరాకీ...... దొరలు పడిచస్తారయ్యా వీటి కోసం"

రావుకన్నీ వినిపిస్తున్నాయి. ఎదురుగుండా ఉన్న అరలో మూడు తాబేళ్ళున్నాయి. విరిగిన రెండో భాగంనుంచి పడిపోయిన రెండూ పక్క కాలువలో ఉన్నాయి. అరలోని తాబేళ్ళలో రెండు వెనుకకి ఉన్నయి. ఒకటి ముందుకొచ్చి ఉంది. అది విరిగిన అరమీద వెల్లకిలా పడి ఉంది. దాని మెడ దిగువకు వేలాడుతూఉంది. దాన్ని లోపలికి తీసుకోవాలని అది ప్రయత్నం చేస్తూ ఉంది. కాని మెడ వ్రేలాడుతూనేఉంది.

దిగువకు వేలాడుతున్న తలలో రెండు కళ్లున్నవి. ఆ కళ్లు ఉబ్బి ఉన్నవి. రెప్పలు లేనికళ్లు అరిగిన గోళీకాయలలా కనిపిస్తున్నాయి. ఆ చిన్నకళ్లనుండి అప్పుడప్పుడు ఒకటి రెండు చిక్కటి




చుక్కలు పడుతున్నవి... అవి అలానే ఉన్నవి... మధ్యాహ్నంనుంచి... కాదు కాదు... ప్రమాదం జరిగిన రాత్రి నుండీ...

"పనిమానేసి ఏంచూస్తున్నావు, రావ్?" భుజంమీద చేయివేసి అడిగారు ఛీఫ్‌యింజనీరుగారు.

"ఈ తాబేళ్లే సార్!..."

"పాపం!..."

"ఏంచేయడమో నాకు తోచకుండా ఉందిసార్!..."

"ఏముంది...అవి ఉన్నా లేనట్లే ... ఇప్పటికే చాలాకాలం వీటికై వ్యర్థమయింది."

"అవి బాధతో కన్నీళ్లు కారుస్తున్నవి సార్!..."

"రావ్!... అవి కన్నీళ్లు కావు... నాకీవిషయం తెలుసు...పడేవవి నెత్తురు చుక్కలు... పట్టుకున్న తరువాత ఈ తాబేళ్లు ఎక్కడికీ పారిపోకుండా కళ్ళు పొడిచేస్తారు... అవి ఒకంతటికి చావవు... ఎంత మరణబాధకైనా విలవిలలాడతాయి..."

"ఏంచేయడం?"

"ఈ చచ్చేతాబేళ్ల కోసం మరి,కాలం వ్యర్థం చేయడానికి వీలులేదు"

ఆయన వెళ్లిపోయారు. ఇది ఆజ్ఞ.

వెల్డరు నారాయణ ముందుకు వచ్చాడు. సగం విరిగిన పార్సెలు పెట్టె పైకప్పు కోయడానికి మీద కెక్కాడు.

నీలి మంట... అది ఇనుపరేకునుతాకి వంగనందు రంగుగా మారింది. నిప్పు రవ్వలు...కాకరపూలు...అవి పక్కను కాలువలోపడిన తాబేళ్ల మీద ముందు

పడ్డవి. వాటి చురకలకి అవి ఇటు అటు గాలిలో కాళ్లు ఆడిస్తున్నవి.

తరువాత మీదనున్న తాబేలుపై నిప్పు రవ్వలు పడడం మొదలయింది. మొదట ఒకటి రెండు... తరువాత జల్లులుగా పడుతున్నవి. కప్పులేని దాని కడుపుమీద అవి వాతలు పెడుతున్నవి. అది కాళ్లను గాలిలో విదలిస్తున్నది...తల ఇటు అటు తిప్పుతున్నది.

"నారాయణా!... ఒక్క క్షణం ఆపు... ఆ తాబేలును పక్కకు తప్పించి..."

రావు మాటలు పూర్తికాకుండా, వెనుక నున్న ఛీఫ్ యింజనీరు అతని భుజం తట్టాడు.

"పని ఆగడానికి వీలులేదు...అప్పుడే రెండుగంటల రాత్రి దాటింది. ఇంకా రెండు పెట్టెలు ఎత్తవలసి ఉంది. ఒక్క నిముషం కాదు, ఒక సెకెండు కాలం వ్యర్థ మయినా, అనుకున్న వేళకు రైళ్లు నడపడానికి లేదు" అన్నారాయన.

నారాయణ తొందరగా కోస్తున్నాడు... నిప్పుల రవ్వలు కావవి...కాకరపూలు కావవి... అవి కరుగుతున్న లోహపు ధారలు... కప్పులేని మెత్తటి తాబేలు కడుపుమీద పడుతున్నవి. అవి వాతలు పెట్టడం లేదు... మర్మాలను ఛేదిస్తు న్నవి...తాబేలు విలయతాండవ మాడు తున్నది. కళ్లంట ధారలు కారుతున్నవి... దాని కళ్ళు, ముఖం మరీ ఉబ్బినవి.

టప్!... అంతవరకు పై రేకుతో కలిసిన రెండుముక్కలు ఒక్కసారి విడి పోయాయి. తాబేలుపడుతున్న బాధకు అది అంతం... కపాల మోక్షం కాబోలు... ఆ తాబేలు పరలోకాలకు వెళ్లిపోతుంది.

రావు అదిరిపడ్డాడు... అంతవరకు వెనుకనే ఉండి చూస్తున్న ఛీఫ్ వెళ్ళి పోయారు...క్రేను ముందుకు వచ్చింది. ఆ పెట్టెముక్కలను, తాబేళ్లను ఎత్తి, వెనుకకు తీసుకొనిపోయి, దూరంగా పారేసివచ్చింది.

"అప్పారావూ!...ఆ తాబేలు చచ్చి పోయిందా?..." తిరిగి వచ్చిన క్రేను డ్రైవరును అడిగాడు రావు.

"లేదుసార్!...ఆ పెట్టె దూరంగా పారేసిన తరువాత చూవానుసార్!... అప్పటికీ అది తల తిప్పి, కాళ్లు ఆడిస్తు న్నది...

కపాలమోక్షం పెట్టెకు?... తాబేలు ఎందుకు బ్రతికి ఉంది...

* *

అనుకున్న వేళకు రైళ్ళు నడిచాయి.. రావు పరివారాన్ని తీసుకొని దక్షిణానికి వెళ్లిపోయాడు.

ఛీఫ్‌యింజనీరు ఛటర్జీగారు మాత్రం ఉండిపోయారు... రెండు రోజులయి అతను ఒక చోట కూర్చొని నాలుగు మెతు కులు తినలేదు... నడుస్తూనే టీ త్రాగడం




రొట్టె ముక్కలు నమలడం చేస్తున్నాడు... సాయంకాలం శుభ్రంగా స్నానం చేసుకొని, రాత్రి భోజనానికి ఊరిలో నున్న పెద్ద హోటలుకి వెళ్లిపోయాడు.

బేరరు వచ్చాడు. ఆయన పూర్తి డిన్నరు ఆర్డరుచేశాడు. బేరరు వచ్చేవరకు ప్రక్కనే వున్న మెనూకార్డు చూచారు...

వరుసగా చదువుతున్నారు ... ... సూప్ ... స్పెషల్ టర్టిల్ సూపు...... ఫ్రెంచిఫ్రై ... చికెన్ ... వరుసగా ఏవేవో, ఆయన మామూలుగా చదివి కార్డు పక్కన పెట్టాడు.

బేరర్ ముందుగా సూప్ తెచ్చాడు. బౌల్ నుండి మంచి వాసనలు వస్తున్నవి ఏమి సూపిది...ఇది స్పెషల్...టర్టిల్ సూపు...టర్టిల్... తాబేలు...

ఆ సూపును ఆయన కళ్లు పెద్దవిచేసి చూచారు.

అందులో ఆయనకో వాలిన మెడ, దాని కంటిన చిన్న తల, ఆ తలలో అరిగిన గోళీలవంటి రెండు కనులు...వాటి నుండి చుక్కలు...కరిగిన లోహపుధారలకు పెరిగిన నెత్తుటి చుక్కలు......

ఆ సూపు బౌలు పక్కకు పెట్టేశారు.

చీఫ్ యింజనీరు ఛటర్జీగారు గబగబా గ్లాసుడు మంచినీళ్ళు త్రాగి టేబిలు నుండి లేచిపోయారు.